

పోటెత్తిన భక్తులు

శ్రీశైలంటెంపుల్: శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్ల దర్శనానికి ఆదివారం భక్తులు శ్రీశైలానికి పోటెత్తారు. భక్తుల రద్దీతో క్షేత్ర పురవీధులన్నీ కిటకిటలాడాయి.



వీనుల విందుగా..

శ్రీశైలంటెంపుల్: ఆలయ నిత్యకళావేదికపై ఆదివారం హైదరాబాద్‌కు చెందిన నరహరి మణికంఠ వారి భక్తి సంగీత కార్యక్రమం భక్తులను అలరించింది.



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం (అడుగులు)	: 1,633
ప్రస్తుతం	: 1,632
సామర్థ్యం (టీఎంసీలు)	: 105.788
ప్రస్తుతం	: 101.735
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 10,742
అవుట్ ఫ్లో	: 10,135

న్యూస్‌రీల్

మార్కెటింగ్ శాఖ డీఈఈగా రఘురామిరెడ్డి

కర్నూలు(అగ్రికల్చర్): మార్కెటింగ్ శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్(డీఈఈ)గా రఘురామిరెడ్డి నియమితులయ్యారు. కర్నూలుకు చెందిన ఈయన ప్రస్తుతం అనంతపురం జిల్లాలో మార్కెటింగ్ శాఖ డీఈఈగా విధులు నిర్వహిస్తున్నారు. రెండేళ్ల క్రితం కర్నూలు జిల్లా డీఈఈ-2గా పనిచేసి మల్టీపర్పస్ గోదాముల నిర్మాణాల పనులను పర్యవేక్షించారు. ప్రస్తుతం పూర్తి స్థాయి డీఈఈగా నియమితులయ్యారు. ఈ మేరకు మార్కెటింగ్ శాఖ ప్రిన్స్‌పల్ సెక్రటరీ ఉత్తర్వులు జారీ చేశారు. ఇంతవరకు ఇక్కడ డీఈఈగా పనిచేసిన సుబ్బారెడ్డి మార్కెటింగ్ శాఖ ఆదోని డీఈఈగా నియమించారు. ఉత్తర్వులు జారీ అయిన వెంటనే ఆదోనిలో పదవీ బాధ్యతలు చేపట్టారు. కర్నూలు డీఈఈ రఘురామిరెడ్డి సోమవారం పదవీ బాధ్యతలు స్వీకరించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

ఏఐసీఎం సమావేశానికి కర్నూలు మేయర్

కర్నూలు (టౌన్): మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని దివాస్ నగరంలో సోమవారం జరిగే అఖిల భారత మేయర్ల మండలి (ఏఐసీఎం) కార్యవర్గ సమావేశంలో పాల్గొనేందుకు నగర మేయర్ బీవై రామయ్య ఆదివారం బయలుదేరి వెళ్లారు. ఏఐసీఎం జాతీయ అధ్యక్షురాలు మాధురీ అతుల్ అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో కార్యవర్గ సభ్యుడి హోదాలో మేయర్ బీవై రామయ్య పాల్గొంటున్నట్లు మేయర్ కార్యాలయ వర్గాలు వెల్లడించాయి. సమావేశంలో ఏఐసీఎం రాష్ట్ర స్థాయి కమిటీల ఏర్పాటు, మేయర్లకు శిక్షణ తరగతులు, కార్యాలయ పునరుద్ధరణ తదితర 9 అంశాలపై చర్చించనున్నట్లు తెలిపారు.

నలుగురు తహసీల్దార్లకు పోస్టింగ్

కర్నూలు(సెంట్రల్): జిల్లాకు కేటాయించిన నలుగురు తహసీల్దార్లకు పోస్టింగ్‌లను కేటాయించారు. కె.రమాదేవికి తుగ్గలి తహసీల్దారుగా, ఎంఏ రమేష్‌ను పత్తికొండ తహసీల్దారుగా, సీహెచ్ ఇంద్రాణిని చిప్పగిరి తహసీల్దారుగా, డి.లోకేశ్వర రావును దేవనకొండ తహసీల్దారుగా నియమించారు. అయితే ప్రస్తుతం దేవనకొండ తహసీల్దార్‌గా ఉన్న రామాంజనమ్మను కలెక్టరేట్‌లోని ల్యాండ్ రీఫామ్స్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా నియమించారు. ఈ మేరకు ఆదివారం కలెక్టర్ రంజిత్ బాషా ఉత్తర్వులు జారీ చేశారు.

17 మండలాల్లో వర్షం

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలోని వివిధ మండలాల్లో వర్షాలు కురిశాయి. శనివారం సాయంత్రం నుంచి ఆదివారం ఉదయం వరకు 17 మండలాల్లో వర్షాలు కురిశాయి. వెల్దుర్తిలో భారీ వర్షం కురిసింది. దాదాపు 15 రోజులుగా జిల్లాలో పొడి వాతావరణం నెలకొంది. ఉన్నట్టుండి వర్షాలు కురిశాయి. వెల్దుర్తిలో 62.4 మి.మీ వర్షం కురిసింది. హొళగుందలో 10.8, ఎమ్మిగనూరులో 10.4, ఆదోనిలో 8.8, కౌతాళంలో 8.4, మద్దికెరలో 7.4, హాలహర్విలో 6.8, ఆస్పరిలో 6.6 మి.మీ ప్రకారం వర్షాలు కురిశాయి. జిల్లా మొత్తంగా సగటున 5.5 మి.మీ వర్షపాతం నమోదైంది. సెప్టెంబరు నెల సాధారణ వర్షపాతం 116.5 మి.మీ ఉండగా.. ఇప్పటి వరకు 58.6 మి.మీ వర్షపాతం నమోదైంది. ఈ నెలకు సంబంధించి 50 శాతం లోటు వర్షపాతం ఉంది.

శ్రీశైలంలో 169 టీఎంసీలు

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం జలాశయంలో ఆదివారం సాయంత్రానికి 169.465 టీఎంసీల నీరు నిల్వ ఉంది. డ్యాం నీటిమట్టం 876.30 అడుగులకు చేరుకుంది. డ్యాం పరిసర ప్రాంతాల్లో 1.20 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. శనివారం నుంచి ఆదివారం వరకు జలాశయానికి ఎగువ ప్రాజెక్ట్‌ల నుంచి 8,950 క్యూసెక్కుల వరద వచ్చి చేరింది. దిగువ ప్రాజెక్ట్‌లకు 61,376 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. కుడిగట్టు కేంద్రంలో 2.167 మిలియన్ యూనిట్లు, ఎడమగట్టు కేంద్రంలో 12.124 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేశారు.

డీఆర్‌డీఏ పీడీగా ప్రతాప్‌రెడ్డి

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఏ) ప్రాజెక్టు డైరెక్టర్‌గా డీ. ప్రతాప్‌రెడ్డిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పంచాయతీ రాజ్‌లో డీఎల్‌డీవో అయిన ఈయన పోస్టింగ్ కోసం ఎదురు చూస్తున్నారు. ప్రకాశం జిల్లా గిద్దలూరుకు చెందిన ఈయన ఉమ్మడి జిల్లాలో నందికొట్కూరు, ఓర్వకల్లు, బేతంచెర్ల మండలాలకు ఎంపీడీవోగా పనిచేశారు. 2018-19 వరకు జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవోగా పనిచేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటు అయిన తర్వాత ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథరెడ్డికి ఓఎస్‌డీగా పనిచేశారు. ప్రస్తుతం డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రిన్స్‌పల్ సెక్రటరీ శశిభూషణ్‌కుమార్ జీవో జారీ చేశారు. సోమవారం పదవీ బాధ్యతలు స్వీకరించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఇంతవరకు డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్‌గా పనిచేస్తున్న ఎన్.సలీమ్‌బాషాను మాతృశాఖ అయిన పంచాయతీరాజ్‌లో రిపోర్టు చేసుకోవాలని జీవోలో పేర్కొన్నారు. ఈయన గత ఏడాది అక్టోబరు 7 నుంచి డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు.

ఈవీలు.. చలో చలో!

వేగంగా తరం మారుతోంది. అదే క్రమంలో ప్రజలు వినియోగించే వస్తువులూ మారిపోతున్నాయి. శాస్త్ర, సాంకేతిక రంగాలు శరవేగంగా అభివృద్ధి చెందడంతో వాహనరంగం దూసుకెళ్తోంది. ఈ క్రమంలో సామాన్యులకు సైతం విద్యుత్ వాహనాలు అందుబాటులోకి రావడంతో రోడ్లపై రయ్..రయ్‌మంటున్నాయి. ఒకప్పుడు నగరాలకే పరిమితమైన ఎలక్ట్రికల్ వాహనాలు ఇప్పుడు పల్లెలకు సైతం చేరాయి. ఇంధన భారంతో ప్రత్యామ్నాయ మార్గంలో ప్రజలు ఈవీల వైపు చూస్తుండటంతో వాటి వినియోగం భారీగా పెరుగుతోంది.

సంవత్సరం	విక్రయాలు	మహిళలు	ఇతరులు
2022	852	534	318
2023	2,874	1,563	1,311
2024 (ఆగస్టు వరకు)	4,193	2,479	1,714
మొత్తం	7,919	4,576	3,343

కొనుగోళ్లలో మహిళలే అధికం....

విద్యుత్ వాహనాల వినియోగంలో మహిళలు అధికంగా ఉన్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో మూడేళ్లగా 4,576 ఎలక్ట్రిక్ వాహనాల రిజిస్ట్రేషన్లు మహిళల పేర్లపై అయ్యాయి. మహిళలకు సౌకర్యవంతంగా ఉండటమే కారణమని తెలుస్తోంది. వాహనం బరువు, ఎత్తు తక్కువగా ఉండటంతో పాటు, ప్రస్తుతం ఉన్న చార్జింగ్‌తో ఎంత దూరం ప్రయాణించవచ్చు, జీపీఎస్ సౌకర్యం ఉండటంతో కళాశాల విద్యార్థినులు ఎక్కువగా ఆసక్తి చూపుతున్నట్లు తెలుస్తోంది.



- విద్యుత్ వాహనాల వినియోగంపై ప్రజల ఆసక్తి
- పర్యావరణ హితం వైపు అడుగులు
- పెరిగిన కార్లు, బైక్‌లు, ఆటోల కొనుగోళ్లు
- మూడేళ్లలో మూడు రెట్లు పెరిగిన ఈవీల విక్రయాలు



ఉమ్మడి జిల్లాలో ఈవీలు... ► ద్విచక్ర వాహనాలు 7,118 ► ఆటోలు 684 ► కార్లు 117

కర్నూలు: ఇంజిన్ మోత లేకుండా విద్యుత్ వాహనాలు (ఈవీ) రహదారులపై దూసుకెళ్తున్నాయి. ఈ విభాగంలో ద్విచక్ర వాహనాలు, ఆటోలే కాదు.. కార్లు కూడా ఉన్నాయి. పెట్రోల్, డీజిల్‌తో నడిచే వాహనాలతో పోలిస్తే బ్యాటరీ కలిగి ఉండే విద్యుత్ వాహనాలు కొంచెం ఖరీదైనా... నగరం, పట్టణాల్లో వాహనదారులు వీటికి మొగ్గు చూపుతున్నారు. పర్యావరణ హితం కోసం ఎలక్ట్రికల్ వాహనాల వినియోగం పెరిగేలా ప్రభుత్వాలు ప్రోత్సాహకాలు అందిస్తున్నాయి. పెరుగుతున్న కాలుష్యం, భారంగా మారిన ఇంధన వనరులు తదితర కారణాలతో వాహనదారులు ఎలక్ట్రిక్ వాహనాల వైపు ఆసక్తి చూపుతున్నారు. ఈ క్రమంలో ఈవీ ఆటోలు, ద్విచక్ర వాహనాలు, కార్ల విక్రయాలు పెరిగాయి. ప్రముఖ కంపెనీలతో పాటు కొత్తగా వచ్చినవి ఉమ్మడి కర్నూలు జిల్లాలో షోరూమ్‌లు ఏర్పాటు చేస్తున్నాయి. పర్యావరణ మిత్రగా ఈ వాహనాలు ఉండటం, శబ్దం లేకుండా నడవటంతో మహిళలు ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారు. ఇప్పటికే పలు చోట్ల చార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశారు. ఓ షోరూమ్ నిర్వాహకులు తమ వాహనాల విక్రయాలను పెంచుకునేందుకు 9 చోట్ల చార్జింగ్ స్టేషన్లు (పవర్ చార్జింగ్ పాయింట్) అందుబాటులోకి తెచ్చారు. అక్కడ చార్జింగ్ పెట్టుకున్నా ఎలాంటి రుసుం వసూలు చేయరు. జిల్లాలో గత మూడేళ్లుగా విద్యుత్ వాహనాల వాడకం పెరిగింది. జిల్లా కేంద్రంతో పాటు ఇతర పట్టణాల ప్రజలు విద్యుత్ ద్విచక్ర వాహనాలను ఎక్కువగా వినియోగిస్తున్నారు. ఇందుకు నిదర్శనంగా విక్రయాల దుకాణాలు (షోరూమ్‌లు) రెండంకెలకు పెరగడాన్ని పేర్కొనవచ్చు. కర్నూలు నగరంలోనే ఈ వాహనాలకు సంబంధించి పది దాకా విక్రయ దుకాణాలు ఉన్నాయి. కాలుష్యానికి చెక్ పెట్టేందుకు వీటి కొనుగోలుకు రాయితీ కూడా ఇస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో నెలకు 300 నుంచి 400 వరకు ఈ వాహన విక్రయాలు జరుగుతున్నాయి.

ఉమ్మడి జిల్లాలో 7,919 ఈవీలు..

ఉమ్మడి జిల్లాలో 7,919 ఎలక్ట్రికల్ వాహనాలు ఆయా ఆర్‌టీఏ కార్యాలయాల పరిధిలో రిజిస్ట్రేషన్ అయ్యాయి. 2020లో 56 ఎలక్ట్రికల్ వాహనాలు ఉండగా 2021లో వాటి సంఖ్య 832కు చేరుకోగా ప్రస్తుతం 7,919 ఉండటం గమనార్హం. వీటిలో ద్విచక్ర వాహనాలే ఎక్కువ మండల కేంద్రాల్లోనూ ఈ-బైక్‌ల వినియోగం పెరిగింది. వీటిని కొనుగోలు చేసినవారికి జీవిత పన్ను, రిజిస్ట్రేషన్ చార్జీల విషయంలో మినహాయింపు ఇస్తూ ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది.

పెట్రోల్ ధరలు భారమై...

ఏటా పెరుగుతున్న పెట్రోల్, డీజిల్ ధరలు సామాన్యులనే కాదు.. ఉన్నత ఆదాయ వర్గాలను బెంబేలెత్తిస్తున్నాయి. ఇంధనానికి ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తున్నారు. ఇందులో ప్రధానంగా కొత్త ద్విచక్ర వాహనాలు కొనుగోలు చేసేవారు విద్యుత్ వాహనాల వైపు దృష్టి సారిస్తున్నారు. గతంలో విద్యుత్ వాహనాలను అంతగా ఇష్టపడని వారు కూడా ఇప్పుడు వీటి కొనుగోలును ఆహ్వానిస్తున్నారు. రాబోయే కాలం వీటిదేనని విక్రయదారులు పేర్కొంటున్నారు. విద్యుత్ ద్విచక్ర వాహనాల ధరలు సామాన్య ప్రజలకు అందుబాటులోనే ఉన్నాయి. వీటి ధరలు రూ.45 వేల నుంచి రూ.1.50 లక్షల వరకు పలుకుతున్నాయి. ఒక్కసారి చార్జింగ్ చేస్తే 40 నుంచి 150 కిలోమీటర్ల వరకు నడుస్తున్నట్లు వాహన విక్రయదారులు చెబుతున్నారు. వాహన వినియోగానికి విద్యుత్ ఖర్చు కూడా పెద్దగా ఉండదంటున్నారు.

వాహన సామర్థ్యం ఆధారంగా లైసెన్స్



వాహన సామర్థ్యాన్ని అనుసరించి డ్రైవింగ్ లైసెన్స్ అవసరం. 25 కిలోమీటర్లకు మించిన వేగంతో వెళ్లే సామర్థ్యం కలిగిన విద్యుత్ ద్విచక్ర వాహనాలు నడిపేవారికి తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలి. లేదంటే చట్టపరంగా చర్యలు ఉంటాయి.

– శ్రీధర్, డీటీసీ

విద్యార్థినులకు బాగుంటుంది

నేను స్థానిక ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలలో చదువుతున్నాను. కాలేజీకి వెళ్లి రావడానికి మా నాన్న రెండేళ్ల క్రితం విద్యుత్ వాహనం కొనిచ్చాడు. విద్యార్థినులకు ఎంతో అనుకూలంగా ఉంటుంది. వాహనాలు చూడటానికి అందంగా, ఆకర్షణీయంగా ఉన్నాయి. పెట్రోల్ ధరలు, వాయు కాలుష్యం బాగా పెరిగిపోతున్న ప్రస్తుత తరుణంలో ఈ వాహనాలు ఎంతో ఉపయోగకరం.

– రాధిక, కర్నూలు

విద్యుత్ ఆటో సౌకర్యంగా ఉంది



విద్యుత్ ఆటో వినియోగం సౌకర్యంగా ఉంది. శబ్దం లేకుండా ముందుకు సాగుతున్నందున ప్రయాణికులు కూడా ఇందులో ప్రయాణించడానికి ఇష్టపడుతున్నారు. నేను మొదట ఈ వాహనాన్ని కొనుగోలు చేసేటప్పుడు చాలా మంది ఇబ్బంది పడతావు, కొనవద్దని చెప్పారు. నాకు ఎలాంటి ఇబ్బందీ లేదు. స్థానిక అవసరాలకు బాగా ఉపయోగపడుతోంది. సౌకర్యంగా ఉన్నందున రెండో వాహనం కూడా కొనుగోలు చేశా.

– ఎస్.ప్రసాద్, వీకర్‌సెక్షన్ కాలనీ, కర్నూలు

పీఆర్‌లో భారీగా బదిలీలు

- జెడ్పీ సీఈఓగా నాసరరెడ్డి, డిప్యూటీ సీఈఓగా ఈవీ సుబ్బారెడ్డి స్థానాలు పదిలం
- పీఆర్ ఎస్ఈగా వీ రామచంద్రారెడ్డి



జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి, డిప్యూటీ సీఈఓ ఈవీ సుబ్బారెడ్డి

కర్నూలు(అర్బన్):పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలో జిల్లా అధికారుల బదిలీలు భారీగా జరిగాయి. జిల్లా పరిషత్ సీఈఓగా జీ నాసరరెడ్డి, డిప్యూటీ సీఈఓగా ఈవీ సుబ్బారెడ్డి స్థానాలు పదిలం అయ్యాయి. వారిని అదే స్థానాల్లో కొనసాగిస్తూ వేర్వేరుగా జీవోలు జారీ అయ్యాయి. అలాగే ఇంజినీరింగ్ విభాగంలో ఖాళీగా ఉన్న పీఆర్ పర్యవేక్షక ఇంజినీరుగా వైఎస్సార్ కడప పీఆర్‌లో ఈఈగా విధులు నిర్వహిస్తున్న వీ రామచంద్రారెడ్డికి పదోన్నతి కల్పిస్తూ ఇక్కడకు పోస్టింగ్ ఇచ్చారు.

- ➤ సీఆర్‌డీలో డిప్యూటేషన్‌పై ఈఈగా ఉన్న డీసీ వెంకటేష్‌ను ఆదోని పీఆర్‌ఐకి బదిలీ చేశారు.
- ➤ ఏపీఎస్ఎస్‌లో డెప్యూటేషన్‌పై ఉన్న ఈఈ రఘురామిరెడ్డిని కర్నూలు పీఐయూకు (షిఫ్టెడ్ టు నంద్యాల జిల్లా), ఇక్కడ ఈఈగా విధులు నిర్వహిస్తున్న పీ రామక్రిష్ణారెడ్డిని అమలాపురం ఈఈగా బదిలీ చేశారు.
- ➤ బద్వేల్‌లో పీఐయూ ఈఈగా ఉన్న కామాటి నాగరాజును నంద్యాల పీఆర్ ఈఈగా బదిలీ చేశారు. ఈ నేపథ్యంలోనే ప్రస్తుతం కర్నూలు పీఆర్ ఈఈగా విధులు నిర్వహిస్తున్న మద్దన్న స్థానాన్ని పదిలం చేశారు.
- ➤ జిల్లా పంచాయతీ అధికారిగా విధులు నిర్వహిస్తున్న టీ నాగరాజునాయుడును అనంతపురం డీపీఓగా బదిలీ చేశారు. ఆయన స్థానంలో జీఎస్‌డబ్ల్యూఎస్‌లో అడిషనల్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న ఎన్ రామనాథ్‌రెడ్డిని నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.
- ➤ కర్నూలు డ్వామాలో డీపీఓగా విధులు నిర్వహిస్తున్న జీ భాస్కర్‌ను కూడా కర్నూలు డీపీఓగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఇద్దరు అధికారులను ఇక్కడికి డీపీఓగా నియమించడం పట్ల కొంత గందరగోళ పరిస్థితి నెలకొంది.
- ➤ కర్నూలు డీఎల్‌డీఓగా విధులు నిర్వహిస్తున్న పీ బాలక్రిష్ణారెడ్డిని అన్నమయ్య జిల్లా పంచాయతీ అధికారిగా నియమించారు.
- ➤ నంద్యాల డీపీఓగా షేక్ జమీఉల్లాను నియమించారు. ఈ బదిలీలకు సంబంధించి ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రెటరీ శశిభూషణ్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు.

అలా వచ్చి.. ఇలా వెళ్లారు!

- నిరాశ పరిచిన మంత్రి నిమ్మల పర్యటన
- మల్యాల ఎత్తిపోతల సందర్శనకే పరిమితం
- ప్రాజెక్ట్ సమస్యలు తెలుసుకోని వైనం



కృష్ణమ్మకు పూజలు చేస్తున్న మంత్రి నిమ్మల రామానాయుడు

నందికొట్కూరు: రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు జిల్లా పర్యటన కేవలం మల్యాల వద్ద కృష్ణా జలాలకు పూజలతోనే సరిపెట్టారనే విమర్శలు వినిపిస్తున్నాయి. రాయలసీమలో ఉమ్మడి నాలుగు జిల్లాలకు సుమారు 7 లక్షల ఎకరాల ఆయకట్టుకు 40 టీఎంసీల కృష్ణా జలాలను ఎత్తిపోసే మల్యాల పథకం, హంద్రీనీవా పథకం స్థితిగతులు తెలుసుకోకుండానే పర్యటనను ముగించారు. ఈ పథకం వివరాలు, సాంకేతిక, పెండింగ్ సమస్యలు, మోటార్ల మరమ్మతులు తదితర వివరాలను మంత్రి దృష్టికి తీసుకెళ్లేందుకు జలవనరుల శాఖ ముఖ్య అధికారులు సిద్ధంగా ఉన్నా మంత్రి సమయం ఇవ్వలేదని తెలుస్తోంది. కృష్ణమ్మకు పూజలు చేసిన అనంతరం మీడియా సమావేశంలో గత ప్రభుత్వంపై విమర్శలు చేసి వెళ్లిపోయారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి వందరోజులు పూర్తి కావస్తోంది. ఇదే సమయంలో హంద్రీనీవా పథకానికి వరద ప్రవాహం ప్రారంభమై 81 రోజులు గడుస్తోంది. పందికోన జలాశయంలో నింపిన కృష్ణా వరద జలాలు కేవలం 0.700 టీఎంసీలే. ఇలాగైతే సాగునీరు ఆయకట్టుకు ఎప్పుడు చేరుతుందో, చెరువులు, జలాశయాలు ఎప్పుడు నింపుతారో అనే విషయాలు మాత్రం మీడియాకు చెప్పకుండా మంత్రి నిమ్మల దాటవేశారు. మంత్రి వెంట నందికొట్కూరు, పత్తికొండ ఎమ్మెల్యేలు జయసూర్య, కేఈ శ్యామ్‌బాబు, ఇరిగేషన్ అధికారులు ఉన్నారు.

రెండు తరాలు గడిచినా తలరాతలు మారలేదు..

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి విద్యుత్ వెలుగు నింపేందుకు సర్వం త్యాగం చేసి రెండు తరాలు గడిచినా తమ తలరాతలు మారలేదని శ్రీశైలం నీటి ముంపు నిర్వాసితులు మంత్రి ఎదుట గోడు వెల్లబోసుకున్నారు. తెలంగాణ వైపు మహబూబ్ నగర్ జిల్లాకు చెందిన నిర్వాసితులకు న్యాయం జరిగిందని, ఆంధ్ర వైపు నందికొట్కూరు నియోజకవర్గంలోని ముంపు బాధితులు అన్యాయానికి గురవుతున్నారన్నారు. ఉద్యోగానికి తమకు ఐదేళ్ల వయస్సు మాత్రమే గడువు ఉందని, ఇప్పటికైనా ఉద్యోగం ఇస్తే తమ కుటుంబాలు బాగుంటాయని నీటిముంపు మహిళా నిరుద్యోగి సాలమ్మ మంత్రిని ప్రాధేయపడింది. ఇప్పుడు ఉద్యోగాలు రాకపోతే నిర్వాసితులందరికీ ఆత్మహత్యలే శరణ్యమని విలపించారు.

సమీక్ష చేపట్టలేదు.. వినతులు తీసుకోలేదు

కర్నూలు న్యూసిటీ: రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు జిల్లా పర్యటన అటు జిల్లా ప్రజలను, ఇటు ప్రజా ప్రతినిధులను నిరాశపరిచింది. జిల్లాకు వస్తున్న మంత్రికి తమ ప్రాంత సమస్యలు వివరించి పరిష్కారం పొందాలని, నియోజకవర్గాల అభివృద్ధికి నిధుల మంజూరు చేయించుకునేందుకు వ్యక్తిగతంగా వినతులు ఇవ్వాలని ఎదురు చూశారు. అలాగే సాగునీటి ప్రాజెక్టుల అభివృద్ధిపై సమీక్షిస్తారని ప్రజలు భావించారు. ఇవ్వన్నీ లేకుండా కేవలం మల్యాల ఎత్తిపోతల పథకం సందర్శనతోనే మంత్రి తన పర్యటన ముగించారు. ఆదివారం ఉదయం 7.30 గంటల సమయంలో మంత్రి నిమ్మల కర్నూలు నగరంలోని అతిథిగృహానికి చేరుకున్నారు. అయితే అప్పటికే పలు నివేదికలతో అధికారులు సిద్ధంగా ఉన్నారు. అయితే మంత్రి సమీక్ష చేపట్టక పోగా కనీసంలో జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టుల గురించి అధికారులను అడిగి తెలుసుకోలేదు. అలాగే మంత్రిని కలిసేందుకు తమ అనుచరులతో కలిసి నియోజకవర్గ సమస్యలు వివరించేందుకు సిద్ధంగా ఉన్న కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, ఎమ్మిగనూరు ఎమ్మెల్యే జయనాగేశ్వరరెడ్డికి సమయం ఇవ్వకపోవడంతో వారు అసహనం వ్యక్తం చేసినట్లు సమాచారం. నియోజకవర్గ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యామ్‌బాబు కోరినా మంత్రి ఎలాంటి సమాధానం ఇవ్వలేదు. మంత్రి పర్యటనపై ముందుగానే ఎందుకు సమాచారం ఇవ్వలేదని పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరితారెడ్డి అధికారులపై మండిపడినట్లు తెలుస్తోంది. అలాగే టీడీపీ కార్యకర్తలతో సమావేశం ఉంటుందని ముందుగానే ప్రకటించడంతో పార్టీ శ్రేణులు భారీగా తరలివచ్చి నిరాశతో వెనుదిరిగారు. గెస్ట్‌హౌస్ నుంచి మంత్రి నిమ్మల ఎమ్మెల్యేలు, అధికారులతో కలసి మంత్రి టీజీ భరత్ ఇంటికి అల్పాహార విందుకు వెళ్లారు. అక్కడి నుంచి మల్యాల పథకం సందర్శనకు బయలుదేరారు.

నేడు కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

కర్నూలు(సెంట్రల్): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో నిర్వహించనున్నట్లు కలెక్టర్ పి.రంజిత్‌బాషా ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సమస్యలు ఉన్న ప్రజలు వినతులను అందజేయాలని సూచించారు. కలెక్టరేట్‌తోపాటు అన్ని మండల, డివిజినల్, మునిసిపల్ కార్యాలయాల్లోనూ ప్రజలను నుంచి అర్జీలు స్వీకరిస్తున్నట్లు ఆయన వివరించారు.

పచ్చని చెట్లపై ప్రతాపం!

- కల్లుదేవకుంట తేరుబజారులో చెట్ల కొట్టివేత
- రాజకీయ వివాదంతో చెట్లపై గొడ్డలి
- అటవీ శాఖ అధికారులు అడ్డుపడినా వెనకడుగేయని వైనం



పురాతన వృక్షాల కింద సేద తీరిన గ్రామస్తులు (ఫైల్)



చెట్లను కొట్టేసిన దృశ్యం

మంత్రాలయం: రాజకీయం దిగజారుడుకు ఇదో నిదర్శనం. అధికార అండతో కొందరు వ్యక్తులు పచ్చని చెట్లపై ప్రతాపం చూపించిన వైనం ఇది. ఎటువంటి ప్రయోజనం లేకపోయినా.. అటవీ శాఖాధికారులు అడ్డుపడినా.. పదికాలాల పాటు నీడ ఇవ్వాల్సిన చెట్లను నేలకూల్చారు. మంత్రాలయం మండలం కల్లుదేవకుంట గ్రామంలో దాదాపు 40 సెంట్ల తేరుబజారు ఉంది. ఏటా ఉగాది పర్వదినాన వీరభద్రస్వామి జాతర జరుగుతోంది. జాతర సందర్భంగా ఈ స్థలంలో రథయాత్ర నిర్వహిస్తారు. ఇదే దారిలోనే ప్రాథమిక సహకార సంఘం సైతం ఉంది. ఈ స్థలం విషయంలో గ్రామానికి చెందిన ఓ వర్గం తరచూ పంచాయతీకి దిగుతోంది. వాస్తవంగా 71జే (ప్రస్తుతం 71జె2సి) సర్వే నంబర్‌లోని 1932 జూన్ 5న సాతంత్ర్య సమరయోధుడు కల్లుదేవకుంట శివారెడ్డి 20 సెంట్ల స్థలాన్ని కొనుగోలు చేసినట్లు రికార్డులు ఉన్నాయి. పెద్దరాముడు భార్య కుచ్చలదిన్నె తాయమ్మ నుంచి కొనుగోలు చేసి తేరు బజారుకు కేటాయించారు. పెద్దల సమక్షంలో హద్దులుగా దారికి అటు ఇటుగా వేప, బసిరి చెట్లు వేశారు. స్థలం విషయంలో తరచూ వివాదం చేస్తున్న ఓ వర్గం శనివారం పగలు ఓ పెద్ద చెట్టును నేలమట్టం చేశారు. విషయం తెలుసుకున్న అటవీశాఖ బీట్ ఆఫీసర్ అనురాధ గ్రామాన్ని చేరుకుని కోత మిషన్ స్వాధీనం చేసుకున్నారు. చెట్లు నరికేందుకు అనుమతి తీసుకోవాలని సూచించారు. అయితే పగలంతా ఊరకనే ఉన్న వారు చీకటి పడగానే నరికివేతకు దిగారు. 6 వేప, 2 బసిరి చెట్లను నేలమట్టం చేసేసి అక్కడి నుంచి జారుకున్నారు. ఈ స్థలం విషయంలో ఓ వర్గానికి అధికార పార్టీ నాయకుల అండ ఉందని బహిరంగ రహస్యం. చెట్ల నరికివేతను అడ్డుకోవాల్సిన నేతలే నేలమట్టానికి అండగా నిలవడం శోచనీయం. పంతాల కోసం పచ్చని చెట్లను నరకడంపై గ్రామస్తులు పెదవి విరుస్తున్నారు.

కేసు నమోదు చేస్తాం

అనవసరంగా చెట్లను నరికివేయడం చట్టరీత్యా నేరం. రెవెన్యూ, అటవీ శాఖాధికారుల అనుమతులు ఉంటేనే చెట్లను కొట్టాలి. అవేమి తీసుకోకుండా చెట్లను నరికేశారు. గ్రామాన్ని సందర్శించి చెట్లను కొట్టే వాళ్లను వారించాం. అయినా మళ్లీ చెట్లను కొట్టేశారు. వాల్టా చట్టం ప్రకారం వారిపై కేసులు నమోదు చేస్తాం. పీఓఆర్ నమోదుతోపాటు చెట్ల విలువను బట్టి జరిమానా విధిస్తాం.

– అనురాధ, ఫారెస్టు బీట్ ఆఫీసర్, ఆదోని

చౌడేశ్వరిదేవి సేవలో..

బనగానపల్లె రూరల్: నందవరం గ్రామంలో వెలసిన శ్రీ చౌడేశ్వరిదేవి అమ్మవారిని కర్నూలు ప్రిన్సిపల్ జిల్లా జడ్జి కబర్ధి ఆదివారం దర్శించుకున్నారు. జడ్జికి ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కామేశ్వరమ్మ ఆలయ ప్రధాన అర్చకుల ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన గోపురం నుంచి పూర్ణకుంభంతో ఘనస్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో కొలువైన శ్రీ చౌడేశ్వరి దేవి అమ్మవారికి కుంకుమార్చన అభిషేకం తదితర పూజలు నిర్వహించారు. పూజల అనంతరం జడ్జి కబర్ధిని సత్కరించి తీర్థప్రసాదం అందజేశారు.



ఆలయ ఆవరణలో కర్నూలు ప్రిన్సిపల్ జిల్లా జడ్జి కబర్ధి

క్లుప్తంగా

వ్యవసాయ మోటారు చోరీ



పైపు కోసి మోటార్‌ను ఎత్తుకెళ్లిన దృశ్యం

కొత్తపల్లి: మండల పరిధిలోని ఎదురుపాడు గ్రామంలో చంద్రశేఖర్ రెడ్డి అనే రైతుకు చెందిన వ్యవసాయ మోటారు చోరీకి గురైంది. తిమ్మరాజు కుంట సమీపంలోని బావి వద్ద మోటారు అమర్చగా ఈఘటన జరిగింది. ఆదివారం గమనించిన సదరు రైతు పోలీసులకు ఫిర్యాదు చేశారు. చోరీకి గురైన వ్యవసాయ మోటార్ దాదాపు రూ. 40 వేలు విలువ చేస్తుందని తెలిపారు. .

ఉరుకుంద ఈఓగా ఎం.విజయరాజు

కర్నూలు(సెంట్రల్): జిల్లాలో ప్రసిద్ధి చెందిన ఉరుకుంద ఈరన్న స్వామి దేవాలయానికి ఈఓగా ఎండోమెంట్ డిప్యూటీ కమిషనర్ ఎం.విజయరాజును నియమించారు. ఈ మేరకు ఆదివారం రాత్రి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

వెదుర్లు స్వాధీనం

మహానంది: స్థానిక ఈశ్వర్‌నగర్ కాలనీకి చెందిన సురసుర సూరి అనే వ్యక్తి తన వాహనంలో అక్రమంగా వెదుర్లు తరలిస్తుండగా అటవీశాఖ సిబ్బంది నిఘా వేసి పట్టుకున్నారు. సుమారు 300కు పైగా వెదురు కర్రలను స్వాధీనం చేసుకున్నారు. కాగా వాహనాన్ని పట్టుకోవడంతో సూరి అనుచరులు అటవీశాఖ సిబ్బందిపై ఎదురుదాడికి దిగడంతో ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. ఉన్నతాధికారుల ఆదేశాలతో మహానంది ఎస్‌ఐ రామ్మోహన్‌రెడ్డి, పోలీసులు ఘటనా స్థలానికెళ్లి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. దాడుల్లో డీఆర్‌ఓ హైమావతి, ఎఫ్ఎస్ఓ రామకృష్ణ, ఎఫ్‌బీఓలు పరమేశ్వరి, ప్రతాప్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి



మధుసూదన్ కుమార్ (ఫైల్)

బనగానపల్లె: మండలంలోని ఇల్లూరుకొత్తపేట గ్రామ సమీపంలో రైలు ఢీకొని ఒకరు చనిపోయారు. స్థానికుల వివరాల మేరకు.. ఇల్లూరుకొత్తపేటకు చెందిన జక్కా మధుసూదన్‌కుమార్(50)కు రైల్వేలైన్ పక్కనే పొలం ఉంది. ఆదివారం ఆ పొలానికి వెళ్లేందుకు రైల్వేలైన్ దాటుతుండగా హఠాత్తుగా నంద్యాల-రేణిగుంటకు వెళ్లే డెమో ట్రైన్ వచ్చి ఢీకొట్టింది. దీంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య నాగమణి, కుమారుడు ఉన్నారు.

కొడుకుపై తండ్రి హత్యాయత్నం



ఆసుపత్రిలో శ్యాంసుందర్‌రెడ్డి

బొమ్మలసత్రం: ఆస్తి కోసం కుమారుడు వేధింపులకు గురిచేస్తుండటంతో తండ్రి హత్యాయత్నానికి పాల్పడ్డాడు. నంద్యాల మండలం భీమవరం గ్రామంలో ఈ సంఘటన జరిగింది. తాలూకా పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. భీమవరం గ్రామానికి చెందిన వెంకట్రామిరెడ్డి దంపతులకు శ్యాసుందర్‌రెడ్డి ఒక్కడే సంతానం. ఇతను కొంత కాలంగా ఆస్తి కోసం తండ్రితో గొడవ పడి ఇంటి నుంచి వెళ్లిపోయి వేరే ఊరిలో జీవిస్తున్నాడు. ఆదివారం మళ్లీ స్వగ్రామానికి చేరుకొని ఆస్తి కావాలంటూ తండ్రిని నిలదీశాడు. ఈ క్రమంలో ఇద్దరి మధ్య మాటామాట పెరిగి ఘర్షణకు దారితీసింది. కోపోద్రిక్తుడైన తండ్రి కత్తితో కుమారుడిపై దాడి చేశాడు. ఈ ఘటనలో గాయపడిని శ్యాంసుందర్‌రెడ్డిని చికిత్స నిమిత్తం స్థానికులు నంద్యాల జీజీహెచ్‌కు తరలించారు. కుమారుడి ఫిర్యాదు మేరకు తండ్రిపై హత్యాయత్నం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తాలూకా పోలీసులు తెలిపారు.

మిరప సాగు ధమాల్!

- ప్రతి ఏటా లక్ష్యానికి రెట్టింపు స్థాయిలో సాగు
- ఈ ఏడాది 21 వేల ఎకరాలకే పరిమితం
- అనుకూలించని వాతావరణం
- గిట్టుబాటు ధర అంతంత మాత్రమే
- సాగుకు దాటిన అదును
- గతేడాది మద్దతు ధరతో గట్టెక్కిన రైతులు



కోవెలకుంట్ల మండలం అమడాల సమీపంలో సాగైన మిరప

కోవెలకుంట్ల: ప్రతి ఏటా సాధారణ విస్తీర్ణానికి రెట్టింపు స్థాయిలో మిరప సాగయ్యేది. ఈ ఏడాది వాతావరణం అనుకూలించకపోవడంతో సాధారణ విస్తీర్ణానికి సైతం చేరుకోలేకపోయింది, నంద్యాల జిల్లా పరిధిలోని 29 మండలాల పరిధిలో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో 31వేల ఎకరాల్లో మిరప సాగు సాధారణ విస్తీర్ణం. మొదట్లో వర్షాలు అనుకూలంగా మారటంతో సాగు విస్తీర్ణం గణనీయంగా పెరుగుతుందని ఉద్యాన శాఖ అధికారులు భావించారు. జిల్లాలోని ఆయా ప్రాంతాల్లో బోర్లు, బావులు, చెరువులు, ఎస్సార్బీసీ, కేసీ కెనాల్, కుందూనది, పాలేరు, కుందరవాగు, తదితర సాగునీటి వనరుల ఆధారంగా సూపర్-10, తేజ, డబ్బీబ్యాడీ రకాలకు చెందిన మిరప సాగు కావాల్సి ఉంది.అయితే, ప్రతికూల వాతావరణ పరిస్థితులు తలెత్తడంతో సాగు విస్తీర్ణం భారీగా తగ్గింది. జిల్లాలోని బనగానపల్లె నియోజకవర్గంలో 11,975 ఎకరాల్లో మిరప సాగు కావాల్సి ఉండగా 8,970 ఎకరాల్లో సాగు కాగా మిగిలిన అన్ని మండలాలను కలుపుకుని 12 వేల ఎకరాల్లో మాత్రమే సాగైంది.

గతేడాది తగ్గిన దిగుబడులు

గత ఏడాది జిల్లాలోని ఆయా మండలాల్లో ఖరీఫ్ సీజన్‌లో 7,141 హెక్టార్లలో మిరప సాగు సాధారణ విస్తీర్ణం కాగా 14,467 హెక్టార్లలో సాగు చేశారు. ఇందులో స్థానిక వ్యవసాయ సబ్ డివిజన్‌లోని కోవెలకుంట్ల, సంజామల, అవుకు, కొలిమిగుండ్ల, ఉయ్యాలవాడ, దొర్నిపాడు మండలాల్లో 2,349 హెక్టార్లలో సాగు చేయాల్సి ఉండగా ఆయా మండలాల్లో 7,540 హెక్టార్లలో రైతులు మిరప పంట వేశారు. రసాయన ఎరువులు, క్రిమి సంహారక మందులు, కోత, తదితర పెట్టుబడుల రూపంలో ఎకరాకు రూ. లక్షకు పైగా వెచ్చించారు. మిరప నెల రోజుల దశ నుంచి వర్షాలు కురియకపోవడం, సాగునీటి వనరులు అందుబాటులో లేకపోవడంతో దిగుబడులపై తీవ్ర ప్రభావం పడింది. పదిరోజులకోసారి ఎస్సార్బీసీ, కేసీ కెనాల్‌కు నీటి విడుదల చేయడంతో పైరుకు సాగునీటిని మళ్లించుకునేందుకు రైతులు అష్టకష్టాలు పడ్డారు. పైరుకు సకాలంలో సాగునీరు అందకపోవడం, వాతావరణం అనుకూలించకపోవడంతో వివిధ రకాల తెగుళ్లు సోకి దిగుబడులు తగ్గాయి. ఎకరాకు 20 క్వింటాళ్లలోపే దిగుబడులు వచ్చాయి. మార్కెట్‌లో క్వింటా ఎండు మిరపకాయలు రూ. 22 వేల నుంచి రూ. 24 వేలు ధర పలకడంతో దిగుబడులు తగ్గినా మద్దతు ధరతో రైతులు గట్టెక్కారు.

జిల్లాలో మిరప సాగు వివరాలు

నియోజవర్గం	సాగు లక్ష్యం (ఎకరాల్లో)	సాగు వివరాలు
బనగానపల్లె	11,975	8,970
నందికొట్కూరు	4,655	3,023
నంద్యాల	4,427	2,680
ఆళ్లగడ్డ	3,443	1,928
శ్రీశైలం	1,810	1,476
డోన్	603	257
పాణ్యం, గడివేముల	4,142	2,742

ఈ ఏడాది 21 వేల ఎకరాలకే పరిమితం

గతేడాది ఖరీఫ్‌లో మిరప సాగుతో నష్టపోయిన రైతులు ఈ ఏడాది వాతావరణం అనుకూలంగా మారటంతో మిరప సాగుపై దృష్టి సారించారు. పొలాలను కౌలుకు తీసుకునేందుకు రైతులు పోటీ పడుతుండటంతో కౌలు ధర అమాంతం పెరిగింది. మిరప సాగు చేసే పొలం ఎకరా రూ. 50 వేల వరకు కౌలు ధర పలికింది. ఆగస్టు మొదటి వారం నుంచి మిరప సాగు కావాల్సి ఉండగా మొదట్లో వర్షాభావంతో సాగునీటి వనరులు అందుబాటులో లేకపోవడంతో రైతులు ఆశించిన స్థాయిలో పంట వేయలేకపోయారు. జిల్లాలోని ఆయా మండలాల పరిధిలో కేవలం 20 వేల ఎకరాకు పరిమితమైంది. ఇందులో సంజామల మండలంలో అత్యధికంగా 2,859 ఎకరాల్లో, పాణ్యం మండలంలో 2,075 ఎకరాల్లో, కోవెలకుంట్ల మండలంలో 1,986 ఎకరాల్లో, అవుకు మండలంలో 1,749 ఎకరాల్లో నంద్యాల మండలంలో 1,628 ఎకరాల్లో, బనగానపల్లె మండలంలో 1,532 ఎకరాల్లో, మిడుతూరు మండలంలో 1,408 ఎకరాల్లో, గోస్పాడు మండలంలో 1,052 ఎకరాల్లో, మిగిలిన మండలాల్లో వెయ్యి ఎకరాల్లోపు మాత్రమే మిరప సాగు కావడం గమనార్హం. సకాలంలో సాగు నీటి వనరులు అందుబాటులో లేకపోవడం, గతేడాది మిరప సాగులో దిగుబడులు తగ్గడం ఈ ఏడాది సాగుపై ప్రభావం చూపింది. మిరప స్థానంలో ఆయా మండలాల్లో రైతులు కంది, మినుము, పెసర, మొక్కజొన్న, తదితర పంటల సాగుపై ఆసక్తి కనబరిచారు. మిరప సాగుకు అదును దాటిపోవడంతో మిగిలిన విస్తీర్ణంలో వచ్చే నెల నుంచి ప్రారంభం కానున్న రబీ సీజన్‌లో జొన్న, మినుము, పప్పుశనగ, తదితర పంటలు వేసేందుకు సమాయత్తమవుతున్నారు.

10 ఎకరాల్లో మిరప సాగు



రెండు ఎకరాల సొంత పొలంతోపాటు ఎకరాకు రూ. 45 వేలు కౌలు చెల్లించి మరో ఎనిమిది ఎకరాలను కలుపుకుని ఈ ఏడాది పది ఎకరాల్లో మిరప పంట వేశాను. రసాయన ఎరువులు, నారు, నాట్లు, తదితర పెట్టుబడుల రూపంలో ఇప్పటికే ఎకరాకు రూ.15 వేలు వెచ్చించాను. చివరి వరకు ఎకరాకు మరో రూ.85 వేల వరకు ఖర్చు చేయాల్సి ఉంటుంది. వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులు రైతులకు ఎప్పటికప్పుడు సలహాలు, సూచనలు అందజేసి అధిక దిగుబడులు సాధించేందుకు కృషి చేయాలి.

– మద్దిలేటి, రైతు, వల్లంపాడు, కోవెలకుంట్ల మండలం

మిరపస్థానంలో కంది, మినుము పంటల సాగు



గతేడాది తొమ్మిది ఎకరాల్లో మిరప పంట సాగు చేశాను. రసాయన ఎరువులు, క్రిమి సంహారక మందులు, కూలీలు, కోత, తదితర పెట్టుబడుల రూపంలో ఎకరాకు రూ. లక్ష వరకు వెచ్చించాను. వర్షాభావ పరిస్థితులు, తెగుళ్ల కారణంగా దిగుబడులు తగ్గాయి. ఎకరాకు 20 క్వింటాల్లోపే దిగుబడులు వచ్చాయి. నష్టాలు చవిచూశాను. ఈ ఏడాది మిరప సాగు కలిసి రాదని భావించి ఆ స్థానంలో మినుము, కంది పంట సాగు చేశాను. ప్రస్తుతం పైర్లు ఆశాజనకంగా ఉన్నాయి.

– వెంకటేశ్వరరెడ్డి, రైతు, కంపమల్ల, కోవెలకుంట్ల మండలం

రైతు ఇంట్లో నాగుపాము హల్‌చల్



పామును పట్టుకున్న బషీర్

ఎమ్మిగనూరు రూరల్: రాళ్లదొడ్డి గ్రామంలోని రంగస్వామి అనే రైతు ఇంట్లో ఆదివారం ఏడు అడుగుల నాగు పాము హల్ చల్ చేసింది. ఇంట్లో కుటుంబసభ్యులు పనులు చేసుకుంటుండగా పాము కనిపించింది. వెంటనే కేకలు వేస్తూ ఇంట్లోని వారు బయటకు పరుగులు తీశారు. చుట్టు పక్కల వారు ఆ పామును పట్టుకునేందుకు ప్రయత్నం చేయగా చిక్కలేదు. గోనెగండ్లకు చెందిన పాముల పట్టే బషీర్‌కు ఫోన్‌లో సమాచారం అందించారు. అతను రంగస్వామి ఇంటికి చేరుకొని చాకచక్యంగా పామును పట్టుకొని బయట వదిలేయడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ సందర్భంగా బషీర్‌ను గ్రామస్తులు అభినందించారు.

చంద్రబాబు హిందువుల మనోభావాలు దెబ్బతీశారు



శ్రీనివాసనాయక్

కోవెలకుంట్ల: తిరుమల లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి వాడారని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హిందువుల మనోభావాలు దెబ్బతినేలా దుష్ప్రచారం చేశారని హిందూ వాహిని రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాండ్లావత్ శ్రీనివాస నాయక్ అన్నారు. ఆదివారం ఆయన కోవెలకుంట్లలో విలేకరులతో మాట్లాడుతూ లడ్డూ తయారీలో జంతువుల కొవ్వు వాడినట్లు మాట్లాడటం సీఎం ఉన్మాద రాజకీయానికి పరాకష్ట అని ఆరోపించారు. తిరుమల ప్రసాదం తయారీలో అలా జరిగి ఉంటే అందుకు కారణమైన వారి కాళ్లు, చేతులు పడిపోతాయని, లేకుంటే తప్పుగా మాట్లాడిన వారికి అదే పరిస్థితి దాపరిస్తుందని విశ్వసిస్తున్నామన్నారు. బాబు మాటలు తిరుమల పవిత్రతనే ప్రశ్నార్థకం చేసిందన్నారు. రాజకీయ లబ్ధికోసం ఆయన భగవంతుడిని వాడుకోవడం చాలా దారుణమన్నారు. హిందువుల మనోభావాలు దెబ్బతినేలా మాట్లాడిన సీఎం చంద్రబాబు ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

నగర పాలక ఎస్‌ఈగా రాజశేఖర్

కర్నూలు(సెంట్రల్): కర్నూలు నగర పాలక సంస్థ సూపరింటెంటెంట్ ఇంజినీరుగా జి.రాజశేఖర్‌ను ప్రభుత్వం నియమించింది. నెల్లూరు జిల్లా ఏపీ టిడ్కో ఎస్ఈగా పనిచేస్తున్న ఆయనను ఇక్కడికి బదిలీ చేసి ఇక్కడ పనిచేస్తున్న ఎస్ఈ వేణుగోపాల్‌ను అక్కడికి బదిలీ చేసింది. అలాగే ఎగ్జిక్యూటీవ్ ఇంజినీరుగా పనిచేసే షాకీర్ హుస్సేన్‌ను అనంతపురం మునిసిపల్ కార్పొరేషన్‌కు బదిలీ చేసింది. నంద్యాల మునిసిపాలిటీలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీరుగా పనిచేసే జె. రమణమూర్తిని కడప జిల్లా ప్రజారోగ్య విభాగానికి ఈఈగా బదిలీ చేశారు. ఈ మేరకు ఆదివారం రాత్రి ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి.

అప్పుల బాధ తాళలేక..

- వేర్వేరు చోట్ల ఇద్దరు రైతులు ఆత్మహత్య



రామాంజినేయులు (ఫైల్), నాగరాజు(ఫైల్)

చిప్పగిరి: అప్పుల బాధ తాళలేక వేర్వేరు చోట్ల ఇద్దరు రైతులు బలవన్మరణానికి పాల్పడ్డారు. బాధిత కుటుంబాల్లో విషాదం నింపిన ఈ ఘటనల వివరాల్లోకి వెళితే.. చిప్పగిరి మండలం బంటణహాలు గ్రామానికి చెందిన సుంకన్న కుమారుడు నాగరాజు (38) అనేక సంవత్సరాలుగా గ్రామంలో పొలాలను కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. పంటల దిగుబడులు సరిగా రాక సాగు కోసం చేసిన అప్పులు పెరిగాయి. వాటిని తీర్చే మార్గం కనిపించకపోవడంతో శనివారం రాత్రి పొలానికి వెళ్లి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పొలానికి వెళ్లిన నాగరాజు ఇంకా రాలేదని కుటుంబ సభ్యులు ఆదివారం ఉదయం అక్కడికి వెళ్లి చూడగా శవమై కనిపించాడు. బోరున విలపిస్తూ పోలీసులకు సమాచారమిచ్చారు. ఆత్మహత్య ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్ఐ రమేష్ బాబు తెలిపారు. కాగా మృతుడికి భార్య లక్ష్మి, కూతురు ఉన్నారు.

కోడుమూరు రూరల్: మండలకేంద్రం గూడూరుకు చెందిన రైతు రామాంజినేయులు (37)తనకున్న నాలుగు ఎకరాలతో పాటు, మరో ఐదు ఎకరాలు కౌలుకు తీసుకుని పంటలు సాగు చేస్తూ జీవనం సాగించేవాడు. గత నాలుగైదేళ్లుగా వ్యవసాయం కలిసి రాకపోవడం, కుటుంబ అవసరాల కోసం చేసిన అప్పులు రూ.8 లక్షలకు పైగా చేరుకున్నాయి. వాటిని తీర్చే మార్గం కనిపించకపోవడంతో ఈనెల 20వతేదీ శుక్రవారం పొలంలో గడ్డి మందు తాగి అపస్మారక స్థితిలో పడిపోయాడు. తర్వాత గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించగా కోలుకోలేక శనివారం రాత్రి మృతి చెందాడు. మృతుడికి భార్య మహాలక్ష్మి, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె సంతానం.

తల్లిదండ్రులు మందలించారని..



మల్లికార్జున (ఫైల్)

సి.బెళగల్: ఖాళీగా ఉండకుండా పనులకు వెళ్లమని తల్లిదండ్రులు మందలించడంతో మనస్థాపం చెంది ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. సి.బెళగల్ మండలం కంబదహాల్ గ్రామం బీసీ కాలనీలో నివాసముంటున్న కురువ మద్దిలేటి, గిడమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు. మొదటి కొడుకు మల్లికార్జున (21) పదవ తరగతి వరకు చదువుకున్నాడు. అయితే, ఈ యువకుడు పనులకు వెళ్లకుండా ఇంటి దగ్గర ఖాళీగా ఉండేవాడు. ఈ క్రమంలో తల్లిదండ్రులకు ఏదైనా పనికి వెళ్లమని చెప్పడంతో కల్లందొడ్డిలోని నాయనమ్మ ఇంటికి వెళ్లాడు. ఆ సమయంలో ఇంట్లో (గుడిసె) ఎవరూ లేకపోవడంతో చీరతో ఉరి వేసుకున్నాడు. సాయంకాలం అటుగా వెళ్లిన మృతుడి మిత్రులు గమనించి ఇరుగుపొరుగు వారి సహాయంతో ఉరిని తొలగించి కుటుంబసభ్యులకు సమాచారమిచ్చారు. చేతికి వచ్చిన కుమారుడు చిన్న విషయానికి మనస్థాపం చెంది ఉరి వేసుకోవడంతో తల్లిదండ్రులు శోక సంద్రంలో మునిగిపోయారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

కంబదహాల్ గ్రామానికే చెందిన వెంకటేష్, లక్ష్మి ఏకైక కుమారుడు మల్లికార్జున ఆదివారం పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నం చేసుకున్నాడు. పొలంలో ఈ అఘాయిత్యానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే సి.బెళగల్‌లో ఓ ప్రైవేట్ వైద్యుడు వద్ద ప్రథమ చికిత్స చేయించి తర్వాత 108 వాహనంలో కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కాగా మల్లికార్జునకు భార్య శంకరమ్మ, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. ఆత్మహత్యాయత్నంకు గల కారణాలు తెలియరాలేదు. ప్రస్తుతం మల్లికార్జున ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు గ్రామస్తులు తెలిపారు.

ఉచిత గ్యాస్ మాటున పార్టీ సభ్యత్వాలు



సభ్యత్వం చేయడానికి వచ్చిన వ్యక్తులను నిలదీస్తున్న గ్రామస్తులు

పెద్దకడబూరు / మంత్రాలయం: కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఉచిత గ్యాస్ హామీ ఇచ్చింది. అధికారంలోకి వచ్చి వందరోజులైనా అమలు చేయలేదు. అయితే, ఇదే హామీ మాటున బీజేపీ నాయకులు పార్టీ సభ్యత్వాలకు తెరలేపారు. సాయంకాలం వేళ ఊరూర వాలిపోయి సభ్యత్వాలు చేసే పనిలో పడ్డారు. ఆదివారం సాయంత్రం పెద్దకడబూరు మండలం కంబదహాళ్ గ్రామంలో పార్టీ బాధ్యులు ప్రవేశించారు. ఉచిత గ్యాస్ కావాలంటే అడ్రస్, సెల్‌ఫోన్ నంబర్‌తో పాటు ఆధార్ నంబర్ చెప్పాలంటూ బుకాయించారు. నిజమేనేమో అని నమ్మిన పలువురు వాటిని ఇస్తూ వచ్చారు. తర్వాత పార్టీ నాయకులు ఎస్సీ కాలనీలోకి ప్రవేశించారు. అక్కడ కూడా అదే సాకుతో సభ్యత్వాలకు పూనుకున్నారు. సెల్ నంబర్‌లకు ఓటీపీ గ్యాస్ సంస్థలకు సంబధించి కాకుండా బీజేపీ సభ్యత్వానికి సంబంధించి మెసేజ్‌లు రావడంతో కొందరు యువకులు వారిని నిలదీశారు. తర్వాత ఈ విషయం అందరికీ తెలియడంతో గ్యాస్ కనెక్షన్ పేరుతో సభ్యత్వం చేయిస్తారా అని జనం ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ మంత్రాలయం అసెంబ్లీ కో కన్వీనర్ చిరుతపల్లి ఈరన్న, నాయకుడు మురళీ ఈ తతంగానికి పూనుకున్నట్లు గ్రామస్తులు పేర్కొన్నారు.

గూడూరులో యువకుడి దారుణ హత్య



పోలీస్‌స్టేషన్ ఎదుట ధర్నా చేస్తున్న రవి కుటుంబసభ్యులు, కాలనీవాసులు, హతుడు బోయ రవి

కోడుమూరు రూరల్: గూడూరు పట్టణంలో ఓ యువకుడిని దారుణంగా హత్య చేశారు. ఆదివారం తెల్లవారుజామున ఈ సంఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గూడూరుకు చెందిన మద్దమ్మకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు. చిన్న కుమారుడు బోయ రవి (20) వ్యవసాయ పనులు చేస్తాడు. ప్రతి రోజులాగే ఆదివారం తెలవారుజామున ఆ యువకుడు కల్లందొడ్డిలోని పశువులకు మేత వేసేందుకు వెళ్లాడు. ఎంత సేపటికి తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు కలందొడ్డికి వెళ్లి చూడగా రవి రక్తపు మడుగులో కొన ఊపిరితో పడి ఉన్నాడు. వెంటనే చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. హత్య విషయం తెలుసుకున్న గూడూరు ఎస్ఐ తిమ్మయ్య సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. తర్వాత కర్నూలు దిశ డీఎస్పీ శ్రీనివాస ఆచారి, కోడుమూరు సీఐ తబ్రేజ్ గూడూరు చేరుకుని విచారణ చేపట్టారు. క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్‌ను రప్పించి హత్య జరిగిన తీరు, కారణాలపై ఆరా తీస్తున్నారు.

బాధిత కుటుంబ సభ్యుల ఆందోళన

దారుణ హత్యకు గురైన యువకుడి కుటుంబ సభ్యులు, మూలగేరి కాలనీవాసులు ఆదివారం రాత్రి గూడూరు పోలీస్ స్టేషన్ ఎదుట బైఠాయించి ధర్నాకు దిగారు. హత్య చేసిన నిందితులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిందితులను సాధ్యమైనంత త్వరగా పట్టుకుంటామని ఎస్ఐ తిమ్మయ్య హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు.

శ్రీశైలంలో వ్యక్తి హత్య



మృతి చెందిన అశోక్

శ్రీశైలం: శ్రీశైలంలోని పాతాళ గంగ పాత మెట్ల మార్గం వద్ద ప్రకాశం జిల్లా మార్కాపురానికి చెందిన అశోక్ అనే వ్యక్తి(50) దారుణ హత్యకు గురయ్యాడు. టూటౌన్ సీఐ చంద్రబాబు చెప్పిన వివరాల మేరకు.. మార్కాపూర్‌కు చెందిన అశోక్‌తో పాటు బాపట్ల బాలగంగాధర్, కడప మధుసూదన్ రెడ్డి పాతాళగంగకు వెళ్లే యాత్రికులకు నుదుటిన బొట్లు పెడుతూ జీవనోపాధి పొందుతున్నారు. శనివారం రాత్రి ముగ్గురు స్థానిక చెంచు గిరిజన గూడెంలో నాటు సారా తాగారు. ఆ సమయంలో చెంచులకు సంబంధించిన సెల్ ఫోన్ కనిపించకపోవడంతో వారు షాపింగ్ కాంప్లెక్స్ వద్దకు చేరుకొని ఈ ముగ్గురిని ప్రశ్నించారు. అశోక్ గిరిజనులకు సర్దిచెప్పి పంపించేశాడు. అనంతరం ముగ్గురు సున్నిపెంటకు వెళ్లి మద్యం తెచ్చుకొని శ్రీశైలం పాతాళ గంగ పాత మెట్ల మార్గంలో తాగారు. తర్వాత సెల్‌ఫోన్ గొడవకు అశోకే కారణమంటూ బాలగంగాధర్, మధుసూదన్ రెడ్డిలు మద్యం బాటిల్ పగలగొట్టి దాంతో అతని గొంతుకోసి పరారయ్యారు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు అక్కడికి చేరుకుని గాయపడిన అశోక్‌ను 108లో ప్రాజెక్టు వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. దీంతో హత్య విషయంపై పోలీసులు మృతుడి బంధువులకు సమాచారమిచ్చి, మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించారు. నిందితులిద్దరినీ అదుపులో తీసుకొని విచారిస్తున్నట్లు టూటౌన్ సీఐ తెలిపారు.

తప్పిపోయిన బాలుడు



కర్నూలు(సెంట్రల్): నగరంలోని బిర్లా గడ్డకు చెందిన బి.రామకృష్ణ, బి.సునీతల కుమారుడు నల్లబోతుల ఈశ్వర్(14) తప్పిపోయాడు. ఆగస్టు 27వ తేదీన రాత్రి 8 గంటల సమయంలో ఆ బాలుడు బయటకు వెళ్లాడు. ఇంటికి తిరిగి రాకపోవడంతో బంధువులు, బస్టాండ్లు, రైల్వే స్టేషన్‌లో వెతికినా కనిపించలేదు. ఈ క్రమంలో ఆదివారం బాలుడి తల్లి సునీత తన కుమారుడు కనిపించడంలేదని మూడో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

25న రగ్బీ పోటీలు

కర్నూలు (టౌన్): ఈనెల 25 వ తేదీన స్థానిక ఆదర్శ విద్యా మందిర్ క్రీడా ప్రాంగణంలో ఉమ్మడి జిల్లా స్థాయి జూనియర్ కళాశాలల రగ్బీ పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా రగ్బీ సంఘం అధ్యక్షుడు గుడిపల్లె సురేందర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. విజేతలకు కప్పులతో పాటు మెడల్స్ ఇవ్వనున్నట్లు వెల్లడించారు. అలాగే అదే రోజు స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్-19 బాలికల రగ్బీ జట్టుకు ఎంపిక ఉంటుందని తెలిపారు. వివరాలకు 93938-27585 సెల్ నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

ఆర్‌డబ్ల్యూఎస్‌లో భారీగా బదిలీలు

- ఉమ్మడి జిల్లాలో 13 మంది డీఈఈ, 41 మంది ఏఈఈలకు స్థాన చలనం

కర్నూలు(అర్బన్): గ్రామీణ నీటి సరఫరా విభాగంలో భారీగా బదిలీలు జరిగాయి. రాష్ట్ర ప్రభుత్వం వివిధ ప్రభుత్వ శాఖల్లోని ఉద్యోగుల బదిలీలకు ఈ నెల 22వ తేది వరకు గడువు ఇవ్వడంతో చివరి రోజైన ఆదివారం అధికారికంగా బదిలీలకు సంబంధించిన ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ నేపథ్యంలోనే ఆర్‌డబ్ల్యూఎస్‌లో జోన్-4 పరిధికి సంబంధించి ఉమ్మడి కర్నూలు జిల్లాలో 13 మంది డీఈఈ, 41 మంది ఏఈఈలను వేర్వేరు ప్రాంతాలకు బదిలీ చేస్తూ ఆ శాఖ ఈఎన్‌సీ పి. సంజీవరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే కర్నూలు సర్కిల్ కార్యాలయంలో డీఈఈగా విధులు నిర్వహిస్తున్న ఎ. పద్మజకు ఈఈగా పదోన్నతి కల్పిస్తూ ఆదోనికి బదిలీ చేశారు.

బదిలీ అయిన డీఈఈలు

పేరు	ప్రస్తుతం పనిచేస్తున్న స్థానం	బదిలీ అయిన స్థానం
ఎస్. ఉమాకాంతరెడ్డి	బనగానపల్లె	ఆత్మకూరు
కడియాల శ్రీనివాస్	ఈఎన్‌సీ కార్యాలయం,	ఆళ్లగడ్డ -2
వై. శివనాగేశ్వరరావు	ఆదోని	హిందూపూర్
ఎస్. మోయినుద్దీన్	కర్నూలు	మంత్రాలయం/ఎమ్మిగనూరు
ఎస్. కుష్‌కుమార్‌రెడ్డి	అనంతపురం క్యూసీ	కర్నూలు క్యూసీ
పి. రమేష్‌కుమార్‌రెడ్డి	కర్నూలు క్యూసీ	డోన్
జె. సాంబయ్య	ఎమ్మిగనూరు	ఆదోని
జి. శ్రీనివాసులు	ఆత్మకూరు	కోడుమూరు
ఎం. విద్యాసాగర్	నందికొట్కూరు -2	ఎమ్మిగనూరు
ఈ శ్రీనివాసరెడ్డి	మంత్రాలయం/ఎమ్మిగనూరు	నందికొట్కూరు-2
బి. అమల	నందికొట్కూరు -1	కర్నూలు
ఎం. మురళీధర్	సత్యవేడు	ఆళ్లగడ్డ-1
జీవీ మధుసూదన్	నంద్యాల (ఎంటీసీ)	బనగానపల్లె

వంద రోజుల పాలన అట్టర్ ఫ్లాప్



మాట్లాడుతున్న జెడ్పీ వైస్ చైర్మన్ దిల్షాద్ నాయక్

శిరివెళ్ల: కూటమి ప్రభుత్వం వంద రోజుల పాలన అట్టర్ ఫ్లాప్ అయిందని జెడ్పీ వైస్ చైర్మన్ దిల్షాద్ నాయక్ అన్నారు. శనివారం ఆమె శిరివెళ్లలో విలేకరులతో మాట్లాడుతూ వంద రోజుల పాలనలో రాష్ట్రంలో హత్యలు, ఆత్మహత్యలు, దాడులు, మహిళలపై అత్యాచారాలే అధికమన్నారు. అధికారం కోసం ఎన్నికల ముందు చంద్రబాబునాయుడు సూపర్ సిక్స్ హామీలు ఇచ్చి మోసం చేశారన్నారు. ఇప్పటి వరకు పింఛన్ మినహా ఏ ఒక్క హామీ అమలు చేయలేదన్నారు. పాఠశాలలు తెరిచి మూడు నెలలు దాటినా తల్లికి వందనం పథకం ప్రారంభించలేదన్నారు. అలాగే రైతులకు ఖరీఫ్‌లో పంట పెట్టుబడికి సాయం చేయలేదన్నారు. ఉచిత ఇసుక హామీ ఎక్కడ కూడా అమలు కావడం లేదన్నారు. ప్రస్తుతం ట్రాక్టర్ ఇసుక రూ. 10 వేలు, లారీ రూ. 20 వేలకు పైగే ధర పలుకుతుందన్నారు. ఇసుక అందుబాటులో లేకపోవడంతో భవన నిర్మాణ కార్మికులు పనులు లేక అల్లాడుతున్నారని చెప్పారు. జగనన్న పాలనలో ట్రాక్టర్ ఇసుక రూ. 6 వేలకే దొరికిందన్నారు. రెండోసారి ఆయన సీఎం అయి ఉంటే అర్హులకు ఈ పాటికే అమ్మ ఒడి, రైతు భరోసా, ఫీజు రీయింబర్స్‌మెంట్ తదితర పథకాల లబ్ధి చేకూరేదన్నారు. ఎన్నికల్లో బాబు మాయమాటలు, సూపర్‌సిక్స్ హామీలు నమ్మి ప్రజలు ఓట్లేశారన్నారు. అయితే, అధికారంలోకి వచ్చిన తర్వాత ఆయన బడ్జెట్ లేదని, హామీలు చూస్తే భయమేస్తుందని చెబుతున్నారని, ఎన్నికల ముందు ఈ విషయం తెలియదా అని ఆమె ప్రశ్నించారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు ముజాఫర్ పాల్గొన్నారు.